సాక్షి
అనకాపల్లి
శనివారం । 20 । ఏప్రిల్ । 2024



ఎన్టీపీసీ గ్రామీణ క్రీడోత్సవం

పరవాడ: ఎన్టీపీసీ సారథ్యంలో పరవాడ మండల స్థాయి క్రీడాపోటీలు లంకెలపాలెం హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు.



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

విశాఖ: కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.3/27.5

ఒకటి రెండు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు కూడా నమోదవుతాయన్నారు.



ఆత్మీయతకు వందనం





అవిఘ్నమస్తు....
సీఎం జగన్ బస్సు యాత్ర దిగ్విజయంగా సాగాలని దిష్టి తీస్తున్న మహిళలు

నాడు..
ఒక్క అడుగు...
రాష్ట్రంలో సంక్షేమ చరిత్రను లిఖించింది..
అవ్వాతాతల మోముల్లో చిరునవ్వు
విరబూయించింది..
అక్కా చెల్లెమ్మలకు ఆసరా ఇచ్చింది...
చిన్నారులను అమ్మ ఒడిలా లాలించి
విద్యాదీవెనలు అందించింది..
ప్రతి గుండెకు ఆరోగ్య సురక్షగా నిలిచింది
ప్రతి రైతుకు భరోసా ఇచ్చింది
లక్షలాది మందికి నీడనిచ్చింది...

ఆ మహాపథికుడు, జన హృదయాధినేత,
సంక్షేమ రథసారథి

నేడు
కోట్లాది మంది ఆశీస్సులతో
మళ్లీ మనముందుకొచ్చాడు..
ఎన్నికల సమరానికి శంఖం పూరించి...
బస్సు యాత్రతో సిద్ధమై వచ్చాడు..
మండువేసవిలో చిరునవ్వుల
వెన్నెలై వచ్చాడు...
ఆ వెన్నెలలో తడిసి ముద్దయిన
వేలాది జనం జేజేలతో
సాదర స్వాగతం పలికారు...
జయహో...జగనన్న అంటూ
నీరాజనాలు పలికారు...

జయహో... జగనన్న

- సీఎం బస్సు యాత్రకు బ్రహ్మరథం
- పాయకరావుపేటలో ఘనంగా స్వాగతం
- హారతులిచ్చి దీవించిన మహిళలు
- జగనన్నను చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు



జగనన్నను చూడాలని...
రహదారికి ఇరువైపులా వేచి ఉన్న జనం



సీఎంకు స్వాగతం పలకడానికి తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు

సాక్షి, అనకాపల్లి, నక్కపల్లి : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా రాష్ట్ర అభ్యుదయ రథాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శుక్రవారం రాత్రి అనకాపల్లి జిల్లాలో అడుగుపెట్టింది. రాత్రి 9 గంటలకు సీఎం బస్సు యాత్ర జిల్లా సరిహద్దు పాయకరావుపేటకు చేరుకుంది. వేలాది మంది పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపైకి వచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కనోసా పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అర కిలోమీటరు దూరంలో ఉన్న జాతీయరహదారి పైకి చేరుకుని ఇరువైపులా నిలుచుని పార్టీ శ్రేణులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు జగనన్నకు ఘన స్వాగతం పలికారు. తనను చూడడానికి వేలాదిగా తరలివచ్చిన జన సందోహానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను ప్రజలకు బస్సుపై నుంచే పరిచయం చేస్తూ రెండు చేతులు జోడించి ముందుకు సాగారు. వై జంక్షన్‌లో మహిళలు హారతులివ్వడంతో పాటు గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి దిష్టి తీసి జగనన్న బస్సుయాత్ర ఏ ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి కావాలని, మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని దీవించారు. రాత్రి 9 గంటల సమయంలో కూడా పాయకరావుపేట పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది తరలిరావడంతో జాతీయ రహదారి జన సంద్రమైంది. జై జగన్.. జైజై జగన్, మళ్లీ నువ్వే సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. పాయకరావుపేటలో బస్సుయాత్రకు స్వాగతం పలికినవారిలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ **సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ** చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బోలిశెట్టి గోవింద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీత బాబు తదితరులు ఉన్నారు.

గొడిచర్ల వద్ద రాత్రి బస

పాయకరావుపేట నుంచి నక్కపల్లి మండలం గొడిచర్ల జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన వసతి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాత్రి బస చేశారు. గొడిచర్ల వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ, సర్పంచ్ అల్లు రమణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పాపారావు, మణిరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు, సర్పంచ్‌లు భార్గవ్, సురేష్ వర్మ, సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ తిరుపతిరావు, గోవిందు ఆధ్వర్యంలో వందలాది మంది సీఎం బస్సు యాత్రకు స్వాగతం పలికారు.



అదిగో జగన్ మామయ్య...
సిద్ధం బస్సుయాత్రలో చిన్నారి ఉత్సాహం...

మోగనున్న సమర శంఖం

- నేడు జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సీఎం జగన్ యాత్ర
- 70 కిలోమీటర్ల మేర రోడ్ షో
- కశింకోట మండలం చింతలపాలెం వద్ద భారీ బహిరంగ సభ
- చిన్నయ్యపాలెం వద్ద సీఎం రాత్రి బస

సీఎం బస్సుయాత్ర జిల్లాలో శనివారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం దొడ్డిగల్లు నుంచి ప్రారంభమై నాలుగు నియోజకవర్గాల్లో జరగనుంది. సార్వత్రిక ఎన్నికలకు తెరలేచిన తరువాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు.

సీఎం పర్యటన ఇలా...

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం ఉదయం 9 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్ల నుంచి ప్రారంభమవుతుంది. ఉద్దండపురం, కాగిత, సీతంపాలెం, నక్కపల్లి, అడ్డరోడ్డు, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురంలో గల లంచ్ పాయింట్ క్యాంప్‌కు చేరుకుంటారు. అనంతరం కశింకోట మండలం నరసింగపల్లి సమీపంలోని చింతలపాలెం వద్ద బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగే బహిరంగ సభలో సీఎం వై.ఎస్ జగన్ ప్రసంగిస్తారు. అనంతరం తాళ్లపాలెం జంక్షన్, బయ్యవరం, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి జంక్షన్-1, జంక్షన్-2, శంకరం, రేబాక, మర్రిపాలెం టోల్‌గేట్, దేవీపురం, అస్కపల్లి మీదుగా రాత్రి 8.30 గంటలకు సబ్బవరం మండలంలోని చిన్నయ్యపాలెంలో గల టిడ్కాన్ రాయల్ వెంచర్ వద్దకు చేరుకుని అక్కడ రాత్రి బస చేయనున్నారు.



చురుగ్గా సభా ప్రాంగణం ఏర్పాట్లు

అట్టహాసంగా కన్నబాబు రాజు నామినేషన్





కన్నబాబురాజు నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ, (ఇన్‌సెట్) నామినేషన్ వేస్తున్న కన్నబాబురాజు, పక్కన ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి, బొడ్డేడ

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీ యలమంచిలి అభ్యర్థి యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు) శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. వేలాది మంది అభిమానులు వెంటరాగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ సమర్పించారు. వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు జై జగన్..జై కన్నబాబు..జై బూడి..అన్న నినాదాలతో హోరెత్తించారు. యలమంచిలి పట్టణ వీధులు శుక్రవారం కిక్కిరిసిపోయాయి. కళాకారుల ఆటపాటలు, డప్పుచప్పుళ్లతో పండగ వాతావరణం కనిపించింది. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు.

రెండో రోజు పార్లమెంట్‌కు 4, అసెంబ్లీకి 6 నామినేషన్లు

తుమ్మపాల: నామినేషన్ల పర్వంలో రెండో రోజు శుక్రవారం అనకాపల్లి లోక్‌సభ స్థానానికి నలుగురు, 4 శాసనసభ స్థానాలకు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంటు స్థానానికి కోన గురువయ్యయాదవ్ (సమాజ్‌వాదీ పార్టీ), కర్రి విజయలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), నమ్మి అప్పలరాజు (భారత చైతన్య యువజన పార్టీ), గవిరెడ్డి రమ (స్వతంత్ర) కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి వారి వద్ద నామినేషన్ సమర్పించారు. అసెంబ్లీ స్థాలకు యలమంచిలి నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (వైఎస్సార్‌సీపీ) నామినేషన్ వేశారు. అనకాపల్లిలో జనసేన పార్టీ తరపున కొణతాల రామకృష్ణ, నర్సీపట్నంలో టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు, మాడుగులలో టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు, పైలా ఈవీఎస్ నాయుడు, స్వతంత్ర అభ్యర్థి కరణం తిరుపతిరావు నామినేషన్లు దాఖలు చేశారు.

దేవదాయ శాఖకు అమ్మవారి నగల అప్పగింత



ఎండోమెంట్ అధికారులకు అమ్మవారి నగలు అప్పగిస్తున్న సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: స్థానిక శ్రీమరిడమ్మ వారి నగలను శుక్రవారం అమ్మవారి ఆలయంలో దేవదాయశాఖ అధికారులకు ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు అందజేశారు. ఎండోమెంట్ ఆభరణాల తనిఖీ అధికారి దుర్గాభవాని, ఈవో గంగారావు, ఆసాది పచ్చగోళ్ల ఈశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ సమక్షంలో నగలు అప్పగించారు. తనిఖీ అధికారి నగలను తూకం వేసి వివరాలను రికార్డుల్లో నమోదు చేశారు. 510 గ్రాముల బంగారు ఆభరణాలు, ఏడున్నర కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఈవో గంగారావు తెలిపారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ రుత్తల లత్సాపాత్రుడు కుటుంబ సభ్యుడైన తాను అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యుడిగా వ్యవహరించేవాడినన్నారు.ఆలయాన్ని దేవదాయశాఖలో విలీనం చేయడంతో తన దగ్గర ఉన్న అమ్మ వారి ఆభరణాలను దేవదాయశాఖ అధికారులకు అప్పగించినట్టు చెప్పారు. నగలు అప్పగింత కార్యక్రమంలో ఏకా శివకుమార్, మామిడి శ్రీను, చిటికెల కన్నబాబు, చింతకాయల వరుణ్ పాల్గొన్నారు.

రె'బెల్స్'

- టీడీపీలో కొనసాగుతున్న సీట్ల ఫైట్
- మాడుగుల అభ్యర్థిగా పైలా నామినేషన్
- పాడేరు నుంచి నామినేషన్ వేసిన కిల్లో రమేష్ నాయుడు
- టికెట్ మార్చి గిడ్డి ఈశ్వరికి ఇస్తారంటూ జోరందుకున్న ప్రచారం
- మాడుగుల అభ్యర్థిగా 22న నామినేషన్ వేస్తానని బండారు ప్రకటన
- అరకులో చంద్రబాబుపై యుద్ధం ప్రకటించిన సివేరి అబ్రహాం
- అదే బాటలో దొన్నుదొర.. నామినేషన్ వేసేందుకు సిద్ధం

సాక్షి, విశాఖపట్నం: వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన టీడీపీ అధినేత చంద్రబాబు టికెట్ల కేటాయింపు విషయంలోనూ అదే పద్ధతి పాటిస్తున్నారు. తొలుత ప్రకటించిన అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో ఆ పార్టీ నేతలు అధినేత తీరుపై మండిపడుతున్నారు. మరో వైపు నామినేషన్లు వేసిన తర్వాత కూడా అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో భంగపడ్డ నాయకులు టీడీపీ రెబల్స్‌గా బరిలోకి దిగడానికి సిద్ధమయ్యారు. మాడుగుల, పాడేరు, అరకు.. ఇలా ప్రతిచోటా రెబెల్స్ మోగుతున్నాయి. దీంతో తిరుగుబావుటా ఎగరేసిన వారికి తాయిళాలు.. నామినేటెడ్ పదవులు ఇస్తామని జపిస్తున్నా.. చంద్రబాబు మాటలు నమ్మడం లేదు. అసలు ఎన్ని పదవులు ఉంటాయి.. ఒకే పదవి ఎంత మందికి ఇస్తారు.. అని భావించిన టికెట్ రాని టీడీపీ నేతలు రెబల్స్‌గా బరిలో దిగుతామని స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల టికెట్ ఆశించి భంగపడిన వారంతా లోలోపల రగిలిపోతున్నారు.

బండారు ఇన్.. పైలా అవుట్ !

మాడుగుల టికెట్ పైలా ప్రసాద్‌కు కేటాయించారు. దీంతో ఆయన శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే బీ ఫారం ఇవ్వకముందే.. బండారు సత్యనారాయణమూర్తి తనకే టికెట్ ఇస్తారని నియోజకవర్గంలోకి ఎంట్రీ ఇచ్చారు. దీంతో పైలాకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారనే ప్రచారం సాగుతోంది. ఒకే వేళ తన సీటు మార్చితే లోకల్‌గా ఉన్న గవిరెడ్డి లేదా కుమార్‌కు ఇచ్చినా తాను సహకరిస్తాను తప్పా ఎక్కడి నుంచో వచ్చిన బండారుకు సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నామినేషన్ వేసి అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. తనను కాదని బండారుకి టికెట్ ఇస్తే.. ఆయన బండారం బయటపెట్టి.. ఎలా నెగ్గుతారో చూస్తానంటూ సవాల్ విసిరారు.

అరకులో డబుల్ ధమాకా..

అరకు నియోజకవర్గంలో టీడీపీకి రెబల్ పోటు తప్పేలా లేదు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా చంద్రబాబు ప్రకటించిన టికెట్ అరకులోయే. ఈ స్థానంలో టీడీపీ తరపున దొన్నుదొర నిలబడుతున్నారంటూ ప్రజలందరి ముందు ప్రకటించారు. చివరికి ఆ టికెట్‌ను బీజేపీకి కేటాయించారు. దీంతో దొన్నుదొర చంద్రబాబుపై యుద్ధం ప్రకటించారు. ఇదే స్థానం కోసం ఆశలు పెట్టుకున్న అబ్రహాంను కూడా చంద్రబాబు నడిరోడ్డుపై వదిలేశారు. దీంతో అబ్రహం, దొన్నుదొర ఇద్దరూ చంద్రబాబు తీరుపై రగిలిపోతున్నారు. కూటమి తరపున బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అబ్రహం కూడా నామినేషన్ వేశారు. దొన్నుదొర కూడా 24న నామినేషన్ వేస్తానని ప్రకటించారు.

అక్కడా తిరుగుబావుటా...!

పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లోనూ అసమ్మతి రగులుతోంది. పాడేరు టికెట్ ఆశించి భంగపడిన గిడ్డి ఈశ్వరి రెబల్‌గా బరిలోకి దిగుతానంటూ హెచ్చరించారు. అయితే.. కిల్లు రమేష్ నాయుడుకు హ్యాండ్ ఇచ్చి.. గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ బీ–ఫారం ఈశ్వరికి ఇస్తే.. తాను రెబల్‌గా పోటీ చేస్తానని కిల్లు హెచ్చరించారు.

రంపచోడవరంలోనూ వంతల రాజేశ్వరి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచి.. గెలిచి.. చంద్రబాబు, లోకేష్‌కు తన సత్తా చూపిస్తానని సవాల్ విసురుతున్నారు. ఇలా.. ప్రతి చోటా టీడీపీకి రెబల్స్ ఉచ్చు బిగుసుకుంటోంది. తిరుగుబాటు చేస్తామన్న నాయకులందర్నీ పిలిపించి అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తానంటూ చంద్రబాబు బుజ్జగిస్తున్నారు. బాబు హామీలను గమనించిన అసంతృప్త నేతలు అధికారంలోకి రాక ముందు హ్యాండి ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోరని మండిపడుతున్నారు. ఎన్నికల్లోనే తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

మాడుగుల టీడీపీలో గందరగోళం

- అభ్యర్థిగా బండారు సత్యనారాయణ మూర్తి పేరు తెరపైకి
- శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన పైలా ప్రసాదరావు
- నిన్నమొన్నటి వరకు మూడు గ్రూపులు
- ఇప్పుడు నాలుగో వ్యక్తి తెరమీదకు
- ఎటువెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్న కార్యకర్తలు



మాడుగులలో నామినేషన్ దాఖలు చేస్తున్న పైలా ప్రసాద్‌రావు

మాడుగుల: మాడుగుల టీడీపీలో గందరగోళ పరిస్థితి నెలకొంది చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు విసిగిపోతున్నారు. ఇప్పటికీ అభ్యర్థి విషయంలో స్పష్టత లేకపోవడంతో అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఇంతవరకు మూడు గ్రూపులుగా ఉన్న మాడుగుల టీడీపీలో తాజాగా నాలుగో వ్యక్తి తెరమీదకు రావడంతో నేతలకు పాలుపోవడం లేదు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులతో కలిసి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి గురువారం మాడుగుల వచ్చి తనను మాడుగుల టీడీపీ అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. మరో వైపు తానే టీడీపీ అభ్యర్థిని అని పేర్కొంటూ పైలా ప్రసాదరావు అట్టహాసంగా శుక్రవారం నామినేషన్ దాఖలుచేశారు. ఇప్పటికే ముగ్గురు నాయకులు మధ్య వర్గపోరుతో నలిగిపోతున్న పార్టీ కార్యకర్తలు ఇప్పుడు నాలుగో వ్యక్తి తెరమీదకు రావడంతో ఎవరి వెనుక తిరగాలి, ఎవరికి పార్టీ అధినాయకత్వం బిఫారం ఇస్తుందో తెలియక జుత్తు పీక్కుంటున్నారు. మాడుగుల అసెంబ్లీ టీడీపీ టికెట్‌ను పైలా ప్రసాదరావు, పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆశించారు. వీరిలో పైలా ప్రసాదరావును మాడుగుల అభ్యర్థిగా గత నెల 14న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దీంతో నెల రోజులుగా ఆయన ప్రచారం చేస్తున్నారు. అయితే తాజా బండారు తెరమీదకు వచ్చింది.

బిఫారం నాకే వస్తుంది : పైలా ప్రసాదరావు

నామినేషన్ అనంతరం పైలా ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ కచ్చితంగా టీడీపీ బిఫారం తనకే వస్తుందని చెప్పారు. ప్యాకేజీ స్టార్‌గా అవతారమెత్తి తనపై కుట్రలు చేయడం మాజీ ఎమ్మెల్యే రామానాయుడుకు తగదని హితవుపలికారు. నిన్నటి మొన్నటి వరకు నాన్‌లోకల్ వద్దు, లోకలే ముద్దు అని ప్రచారం చేసిన వ్యక్తులు ఇప్పుడు నాన్‌లోకల్ అయిన బండారు సత్యనారాయణ మూర్తికి ఎలా మద్దతు తెలుపుతున్నారని ప్రశ్నించారు.పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా పనిచేస్తామని దేవుడి ఎదుట చెప్పిన పీవీజీ, రామానాయుడులు ఇప్పుడు తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. మాట తప్పిన వారికి కార్యకర్తలతో పాటు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. బండారుకు టికెట్ ప్రకటించారని చెబుతున్నారు, మీకు బిఫారం రాకపోతే ఏంచేస్తారని విలేకరులు ప్రశ్నించగా బి ఫారం రానప్పుడు మీరు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతానని పైలా సమాధానమిచ్చారు. చంద్రబాబు ఆశీస్సులతో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అయ్యన్నపాత్రుడిపై 17 కేసులు

- ఆయన పేరిట రూ.5.04 కోట్ల ఆస్తులు .. భార్య పేరిట రూ.10.82 కోట్ల ఆస్తులు

విశాఖ సిటీ: మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడిపై 17 కేసులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్నారు. అతనిపై ఉమ్మడి విశాఖ లోనే కాకుండా రాష్ట్రంలో పలు చోట్ల కేసులు నమోదయ్యాయి.

- కృష్ణా జిల్లాలో జరిగిన సభలో అయ్య న్న ముఖ్యమంత్రిజగన్‌మోహన్‌రెడ్డి,మంత్రి రో జాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో అత్కూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది.
- ప్రభుత్వ భూమి ఆక్రమించి అధికారి సంతకం ఫోర్జరీ చేసి నిర్మాణాలు చేపట్టడంతో అమరావతి సీఐడీ కేసు నమోదు చేసింది.
- సోషల్ మీడియాలో ఏయూ ప్రతిష్టకు భంగంవాటిల్లేలా పోస్టులు పెట్టించడంతో విశాఖ త్రీటౌన్‌లో కేసు నమోదు చేశారు.
- సభలు, సమావేశాల్లో పోలీసులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం, విధులకు భంగం కలిగించిన వ్యవహారాల్లో నర్సీపట్నంలోనే కాకుండా రాజమండ్రి పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టారు.
- గుంటూరులో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సీఎం జగన్‌ను, అప్పటి హోం మంత్రి సుచరితను దూషించిన వ్యవహారంలోనే కాకుండా నర్సీపట్నంలో దళితులను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలపై అతనిపై మూడుచోట్ల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.

అయ్యన్నపాత్రుడి పేరిట రూ.5,04,61, 500 విలువైన, అతనిభార్య పేరిట రూ.10.84, 63,200 విలువైన స్థిర,చరాస్తులు ఉన్నా య ని ఎన్నికలఅఫిడవిట్‌లో పేర్కొన్నారు.అయ్యన్నకు రూ.1,13,23,032, అతని భార్యకు రూ.4,79,24,824 చరాస్తులు ఉన్నాయి.

- అయ్యన్న, ఆయన భార్యకు సుమారు రూ.7 కోట్ల విలువైన స్థలాలు, భూములు, సుమారు రూ.9 కోట్ల విలువైన భవనాలు ఉన్నాయి. ఇవి కాకుండా అయ్యన్నపాత్రుడు భార్య పద్మావతికి కేజీ బంగారం ఉంది. దీని విలువ రూ.70 లక్షలు. దీంతో పాటు రూ.3.56 లక్షలు విలువ చేసే 4 కిలోల వెండి కూడా ఉంది. ఇంకా వాహనాలు, బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, ఉన్నాయి. అయ్యన్నకు ఎటువంటి అప్పులు, రుణాలు లేవు. అతని భార్యకు మాత్రం రూ.1,38,16,034 బ్యాంకుల నుంచి రుణాలు, ఇతరుల నుంచి రూ.1,48,57,545 రుణాలు ఉన్నాయి.

కన్నబాబు ఆస్తులు రూ.36 కోట్లు

- భార్య రాధాదేవి పేరిట రూ.రూ.14కోట్లు
- ఇద్దరి పేరిట రూ.15కోట్ల అప్పు

యలమంచిలి రూరల్: యలమంచిలి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణ మూర్తి రాజు(కన్నబాబు) ఆస్తులు రూ.36.72 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో చూపించారు. వీటిలో చరాస్తులు సుమారు రూ.16.05 కోట్లు, స్థిరాస్తులు సుమారు రూ.20.67 కోట్లు ఉన్నాయి. భార్య రాధాదేవి పేరిట చర,స్థిరాస్తులు రూ.14.56 కోట్ల ఆస్తులున్నట్టు తెలిపారు. చరాస్తులు సుమారు రూ.6.39 కోట్లు, సుమారు స్థిరాస్తులు రూ.8.17 కోట్లు ఉన్నాయి. ఇద్దరికీ సొంత కారు లేదని తెలిపారు. కన్నబాబు పేరిట రూ.12.21 కోట్లు, భార్య రాధాదేవి పేరిట రూ.3.22 కోట్ల అప్పు ఉందని అఫిడవిట్‌లో పొందుపరిచారు.కన్నబాబుపై క్రిమినల్ కేసులేవీ లేనట్టు పేర్కొన్నారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్టు జిలా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సమావేశంలో నిర్ణయాలు ఉంటాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

రూ.60 కోట్ల ఆస్తి పరుడు.. కానీ కారు లేదు..

- రూ.60.18 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో కొణతాల వెల్లడి
- అతని వారసుల పేరు మీద మరో రూ.3.77 కోట్ల ఆస్తులు

విశాఖ సిటీ: అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ రూ.60 కోట్ల ఆస్తిపరుడు. కానీ కారు లేదట. అతని వారసుల ఇద్దరి పేరు మీద మరో రూ.3,77,05,133 స్థిర,చరాస్తులుఉన్నాయి. వారికి కూడా ఎటువంటి వాహనం లేదు. ఈ మేరకు కొణతాల శుక్రవారం దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను పొందుపర్చారు. కొణతాల స్థిరాస్తులు రూ.58,97,53,200 కాగా.. చరాస్తులు రూ.1,20,77,938గాపేర్కొన్నారు. మొత్తం రూ.60,18,31,138ఆస్తులున్నట్లు తెలిపారు. ఇందులో వారసత్వ ఆస్తిగా రూ.2,34,88,200 మాత్రమే కాగా.. మిగిలిన మొత్తం తన సంపాదనగా చూపించారు. అప్పులు గానీ, రుణాలు గాని లేవు.

అఫిడవిట్‌లో ఆస్తుల వివరాల ప్రకారం..

- కొణతాల వద్ద ప్రస్తుతం రూ.69 వేల నగదు మాత్రమే ఉంది.
- 5 బ్యాంకుల్లో రూ.8,90,108 నగదు డిపాజిట్లు ఉన్నాయి.
- అప్పులు లేకపోగా. తానే లక్ష్మీ నరసింహ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు సుమారు రూ.95 లక్షలు వరకు రుణాలు ఇచ్చారు.
- రూ.1,531 లక్షలు విలువ చేసే 224 గ్రాముల బంగారం, రూ.72 వేలు విలువ చేసే 800 గ్రాముల వెండి ఉంది. అతని ఇద్దరు వారసులకు కూడా ఇదే మొత్తంలో బంగారం, వెండి ఉంది.
- అనకాపల్లి, మాడుగుల ప్రాంతాల్లో ఏడు చోట్ల 4.59 ఎకరాల వ్యవసాయ భూములు, అనకాపల్లిలో 3 ఎకరాల వ్యవసాయేతర భూమి, నగరంలో కంచరపాలెంలో కమర్షియల్ నిర్మాణం, అనకాపల్లి, కంచరపాలెం ప్రాంతాల్లో నివాస సముదాయాలు ఉన్నాయి. వీటివిలువ రూ.58,97,53,200.కొణతాలవారసులుఇద్దరికిచెరో రూ..1,13,14,000 స్థిరాస్తులు ఉన్నాయి. కొణతాలపై ఎటువంటి కేసులు లేవు.

అడుగడుగునా నిబంధనల అతిక్రమణ



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన కొణతాల, రిత్విక్



ర్యాలీలో చిక్కుకున్న అగ్నిమాపక శాఖ వాహనం

- కొణతాల నామినేషన్ ర్యాలీతో ట్రాఫిక్ జామ్
- ట్రాఫిక్‌లో రెండుగంటల పాటు చిక్కుకున్న స్కూల్ పిల్లల బస్సులు
- అగ్నిమాపక శకటానికీ అడ్డంకులు
- నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించి నిబంధనలు ఉల్లంఘించిన నేతలు

తుమ్మపాల: జనసేన అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నామినేషన్ ర్యాలీ కారణంగా శుక్రవారం పట్టణ వాసులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈ ర్యాలీలో అడుగడుగునా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారు. పట్టణంలో రింగ్‌రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా నాలుగు రోడ్ల నుంచి గాంధీనగరం గుండాల జంక్షన్ వద్ద గల ఆర్వో కార్యాలయానికి చేరుకునేందుకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ క్రమంలో ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తూ ఆయా కూడళ్లలో ఉన్న అంబేడ్కర్, మహాత్మాగాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు గల ముసుగులను తొలగించి కొణతాలరామకృష్ణ, ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ కుమారుడు రిత్విక్ పూలమాలలు వేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద 100 మీటర్ల పరిధిలో పోలీసులు ఏర్పాటుచేసి న బారికేడ్లను దాటుకుని రిటర్నింగ్ అధికారి కార్యాలయం గేటు వరకు కొణతాలతో పాటు వందలాదిమంది జనం దూసుకొచ్చారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు యత్నించగా కొందరు నాయకులు వారితో వాగ్వాదం చేశారు. అదే సమయంలో దాడి వీరభద్రరావు కుమారుడు జైవీర్, భీశెట్టి సుధ, పలువురు నాయకులు పోలీసుల వైఖరిని వ్యతిరేకిస్తూ అక్కడే మీడియా సమావేశం నిర్వహించే ప్రయత్నం చేశారు. ఎన్నికల నిబంధనలను గుర్తు చేయడంతో దూరంగా వెళ్లిపోయారు. కొణతాల రామకృష్ణతో పాటు మరో నలుగురికి మాత్రమే లోపలికి అవకాశం కల్పించారు. ఇదిలా ఉంటే నామినేషన్ కార్యక్రమానికి వచ్చి కార్యకర్తలకు అనకాపల్లి – చోడవరం రోడ్డు తుమ్మపాలలో భోజనాలు, బైకులకు పెట్రోల్ వేయించేందుకు ఇక్కడి పెట్రోల్ బంక్‌లో టోకెన్లు ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా వాహనాలు తుమ్మపాల వైపు ప్రయాణించడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సుమారు రెండు గంటల పాటు గుండాల జంక్షన్ నుంచి తుమ్మపాల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఒంటిపూట బడులు కావడంతో పాఠశాలలనుంచి పిల్లలతో వస్తున్న 20కి పైగా స్కూల్ బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. ఎండ తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు.

ర్యాలీలో చిక్కుకున్న అగ్నిమాపక శకటం

ర్యాలీ కారణంగా అగ్నిమాపక శాఖ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. చోడవరం మండలం గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది, చోడవరం అగ్నిమాపకశాఖ ఉద్యోగులు అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారులకు శుక్రవారం సమాచారం ఇచ్చారు. దీంతో మంటలను అదుపుచేసేందుకు అనకాపల్లి అగ్నిమాపక శాఖ వాహనం రైల్వేస్టేషన్, విజయరామరాజు రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా గోవాడ బయలుదేరింది. నామినేషన్ ర్యాలీ కారణంగాఇరువైపులాట్రాఫిక్‌జామ్‌అవడంతో అగ్నిమాపక శకటం ముందుకు వెళ్లలేక నిలిచిపోయింది. ఈలోగా చోడవరం అగ్నిమాపక శాఖ అధికారులు ఫోన్‌చేసి గోవాడలో మంటలు అదుపులోకి వచ్చినట్టు తెలియజేయడంతో వాహన డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నారు. సుమారుగా అరగంట తరువాత ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్



సమావేశంలో మాట్లాడుతున్న నీనా నిగమ్

తుమ్మపాల: రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు పూర్తి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకురాలు నీనా నిగమ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణలతో కలిసి వివిధ ఎన్నికల విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికలు రాజకీయంగా, ఖర్చుపరంగా పరిస్థితులు సంక్లిష్టంగా ఉండవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సునిశిత దృష్టితో మెలగుతూ ఎటువంటి అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధనం, మత్తు పదార్థాలు, కానుకలతో ఓటర్లను ప్రలోభపర్చడం, వంటి పరిస్థితులను గమనించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రకాలుగా పార్శిళ్లు, నగదు రహిత లావాదేవీల నిర్వహణకు వీలులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునే ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పోలీసు, అధికారులపై ఉంటుందన్నారు. అంతకుముందు కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా స్వరూప స్వభావాలు, సరిహద్దులు, నియోజకవర్గాలు, రాజకీయ ఆర్థిక పరిస్థితుల గురించి వివరించారు. జిల్లా ఎన్నికల నిర్వహణలో పనిచేస్తున్న వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్, ఆర్ఐలకు నాన్ బెయిలబుల్ వారెంట్లు

యలమంచిలి రూరల్: ఒక కేసులో కోర్టుకు హాజరు కానందుకు యలమంచిలి పూర్వ తహసీల్దార్ ఎస్.రాణీ అమ్మా జీ, పూర్వ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజయ్‌భాస్కర్‌లకు యలమంచిలి అడిషినల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేసినట్టు న్యాయవాది ఎస్‌వీపీ ప్రసాద్ శుక్రవారం రాత్రి తెలిపారు. తనకు తెలీకుండా తన పేరును తొలగించి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అక్రమంగా జారీ చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ యలమంచిలి పట్టణానికి చెందిన కొయ్య మంగ సరస్వతి కోర్టులో కేసువేశారు. 2015లో తన కుటుంబ సభ్యులు తన తండ్రిఆస్తులను అక్రమంగా చేజిక్కించుకోవడానికి పథకం రచించి రెవెన్యూ అధికారులకు ముడుపులిచ్చి అక్రమంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందారనే అభియోగంపై బాధితురాలు కోర్టులో వ్యాజ్యం వేశారు. కేసు విచారణలో భాగంగా ఏ1, ఏ2లు తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఆర్ఐ విజయ్‌భాస్కర్‌లు ఈ నెల 15న కోర్టుకు హాజరుకాలేదు. దీంతో న్యాయమూర్తి ఇద్దరికీ నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీచేశారని,కేసువచ్చే నెల14వ తేదీకి వాయిదా వేశారని న్యాయవాది చెప్పారు.

వజ్ర కవచధర గోవిందా



వజ్ర కవచంతో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: చైత్ర శుద్ధ ఏకాద శిని పురస్కరించుకుని స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శుక్రవారం వజ్రకవచాన్ని అలంకరించి,అభిషేకాలు, పూజలు నిర్వహించా రు. అర్చ కుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలోభక్తులుఅధిక సంఖ్యలోపాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం రేపు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లోని గుమస్తాల సంఘం కార్యాలయం వద్ద ఈనెల 21న వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, కార్యదర్శి యల్లపు సాంబశివరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లబ్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ

అనకాపల్లి: జీవీఎంసీ జోన్ పరిధిలో 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు ఈనెల 30వ తేదీలోపు చెల్లించి 5 శాతం రాయితీ పొందాలని జోనల్ కమిషనర్ ఒమ్మి అప్పలనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోనల్ కార్యాలయం, సచివాలయాల్లో పన్ను చెల్లించ వచ్చని ఆయన పేర్కొన్నారు. సెలవు రోజుల్లో జోనల్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక మంగళ గౌరీ వత్రాలు



శివాలయంలో నిర్వహిస్తున్న సామూహిక మంగళగౌరీ వ్రతాలు

కశింకోట: స్థానిక శివాలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక మంగళ గౌరీ వ్రతాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయ అర్చకుడు వి.చిదంబరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మేమంతా సిద్ధం సభకు ఏర్పాట్లు పూర్తి



విడిది టెంట్లు



సభా ప్రాంగణంలో విద్యుత్ దీపాల వెలుగులు



సభా ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సమీపంలోని గొబ్బూరు వద్ద మేమంతా సిద్ధం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఇక్కడ జరిగే సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించనున్నారు. యుద్ధ ప్రాతిపదికన భూములను చదును చేసి భారీ ఏర్పాట్లు చేశారు. పెద్ద సభా వేదిక, వేదిక ముందు ర్యాంప్, చుట్టూ ప్రాంగణం ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని గ్రిల్స్‌తో పటిష్టం చేశారు. విద్యుత్ దీపాలు, రహదారులు, విడిది టెంట్లను ఏర్పాటు చేశారు. సభాప్రాంగణం ముందు 10 సోలార్ దీపాలను ఏర్పాటు చేశారు. సభ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్,మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ యువజన నాయకుడు మలసాల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అధికంగా అగ్నిప్రమాదాలు



ఎన్టీఆర్ వైద్యాలయంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారి నర్సింగరావు



ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక ఉద్యోగులు

- అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగరావు

అనకాపల్లి: వేసవిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అధికంగా అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు తెలిపారు. విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం, ప్రైవేట్ ఆస్పత్రిలలో ప్రమాదాలపై శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న తప్పిదాల వల్ల అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, వేసవి కాలంలో ఈ ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ప్రమాదాలపై ఎప్పటికప్పుడు పట్టణ, మండలంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయం వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కశింకోట: స్థానిక లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చైత్ర శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. వేగి తారకేశ్వరరావు, పరమేశ్వరి దంపతులతో కల్యాణం నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. కల్యాణానికి ముందు విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం పూలమాలతో స్వామివారిని అందంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి ఆధ్వర్యంలో ఈ కల్యాణోత్సవాలు నిర్వహించారు.

గురుకులాల్లో 88 మందికి ప్రవేశం



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయాధికారి రూపవతి

కశింకోట: ఉమ్మడి విశాఖ జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 183 సీట్ల భర్తీకి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయాధికారి ఎస్.రూపవతి తెలిపారు. 88 మందికి వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించినట్టు ఆమె తెలిపారు. మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో ఇంకా 95 సీట్లు భర్తీ కావలసి ఉందన్నారు. స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.గ్రేస్‌తోపాటు ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రేపు

కశింకోట:మండలంలోని తేగాడ గ్రామం వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం తెలిపారు. పరీక్ష సమయానికి గంట ముందు పరీక్ష కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమతోపాటు ఆధార్ కార్డు, హాల్ టిక్కెట్టు, ఒక పాసు పోర్టు సైజు ఫొటో తీసుకుని రావాలని తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో దయానిధి

తుమ్మపాల: ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 12,86,241 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. వారిలో 6,25,861మంది పురుషులు, 6,60,352 మంది మహిళలు, 28 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారన్నారని, ఇంకా 2,113 క్లైమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. 278 మంది ఓటర్ల నివాస మార్పు చేయవలసి ఉందన్నారు. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం ప్రారంభమైందని, 26వ తేదీన స్క్రూటీనీ , 29వ తేదీన ఉపసంహరణలు ఉంటాయన్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి అదనపు రేట్ చార్ట్‌ను అందజేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కొల్లి రావు, పి.నాగేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి, డీటీ రవిబాబు, ఎస్ఎ. తులసీరామ్ పాల్గొన్నారు.

బెల్లం మార్కెట్‌లో రెండో రోజు నిలిచిన లావాదేవీలు



బెల్లం దిమ్మలు లేక వెలవెలబోతున్న యార్డు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో రెండవరోజు శుక్రవారం కూడా లావాదేవీలు నిలిచిపోయాయి. కొలగార్లు, వర్తకుల మధ్య నగదు చెల్లింపులో ఏర్పడిన వివాదం కారణంగా లావాదేవీలు నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొంటున్నారు. ఇంతవరకూ కొలగార్లకు వారానికి ఒకసారి కూలి చెల్లించేవారు. అయితే ఏ రోజుకూలి ఆరోజే చెల్లించాలని కొలగార్లు కోరుతున్నారు. ఇప్పటి వరకూ వారంరోజుల తరువాత నగదు చెల్లించేవారమని, ఇక నుంచి రెండు, మూడురోజులు తరువాత నగదు చెల్లిస్తామని వర్తకులు చెబుతున్నారు. మార్కెట్ యార్డు కార్యదర్శి శకుంతల మాట్లాడుతూ శనివారం ఇరువర్గాలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రతి ఏడాది మార్కెట్‌కు జనవరి నుంచి శ్రీరామనవమి రెండు రోజుల ముందు వరకూ జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి రైతులు బెల్లం దిమ్మలు తీసుకువస్తారని, శ్రీరామనవమి తరువాత మార్కెట్‌కు బెల్లం దిమ్మలు తక్కువగా వస్తాయని ఆమె చెప్పారు. యార్డుల్లో 220 మంది కొలగార్లు పనిచేస్తున్నారని, వర్తకులు 62మంది ఉన్నట్లు ఆమె తెలిపారు. సోమవారం నుంచి మార్కెట్‌ల్లో యథావిధిగా లావాదేవీలు జరిగేవిధంగా చర్యలు చేపట్టనున్నట్టు ఆమె చెప్పారు.

‘బీజేపీ కూటమిని ఓడించాలి’



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పి.ఎస్.అజయ్‌కుమార్

అనకాపల్లి: బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయం సమీపంలో ఇండియా కూటమి కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ దేశానికి ఎంతో ప్రమాదకరమైన పార్టీ అని చెప్పారు. ఈ విషయం ఇటీవల బయటపడిన ఎలక్టోరల్ బాండ్స్ కుంభకోణం బయటపెట్టిందన్నారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద కుంభకోణం అని చెప్పారు. ఇలాంటిది మరో దేశంలో జరిగితే అక్కడ ప్రధాని లేదా అధ్యక్షుడిని జైలులో వేస్తారని తెలిపారు. మహారాష్ట్రలో శివసేనకు పట్టిన గతే రాష్ట్రంలో కూటమికి పడుతుందన్నారు. సీఎం రమేష్‌ను 2018లో ఆంధ్రవిజయమాల్యా అని అప్పటి బీజేపీ నాయకుడు జి.వి.ఎల్. నర్సింహారావు అన్నారని, ఇప్పుడు కొత్తపల్లి గీత, సీఎం రమేష్‌లను బీజేపీ అభ్యర్థులుగా ఎలా నిలబెట్టారని ప్రశ్నించారు. బ్యాంకులను మోసం చేసిన పై ఇద్దరికీ రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియా కూటమి అభ్యర్థులు పాల్గొన్నారు.